## రోడ్డు వెడల్పు పనులను చేపట్టాలి : ఎమ్మెల్యే



తెలంగాణ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రోడ్డు వెడల్పు పనులను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ తెలంగాణచౌరస్తా మీదుగా సుమారు 50 కాలనీలవాసులు నిత్యం రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళలో, వివాహ శుభకార్యాలు ఉన్న రోజుల్లో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇటీవల సదరు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ తెలంగాణ చౌరస్తాలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పక్కన ఉన్న కృష్ణవాటర్ చాంబర్, ట్రాన్స్‌ఫారమ్, స్తంభాలు వెనక్కి జరిపి రోడ్డు వెడల్పు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పనులు పూర్తి అయితే ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు ముద్దగౌని సుమన్‌గౌడ్, అనిల్‌చౌదరి, ప్రభాకర్‌రెడ్డి, పోగుల రాంబాబు, కొట్ర శివముదిరాజ్ పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పదవులు

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ఓల్డ్‌మలక్‌పేట/చాదర్‌ఘాట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కష్టపడిన కార్యకర్తలకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పదవులు కట్టబెడుతున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్‌తో కలిసి హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మి ఆయనను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం చైర్‌పర్సన్‌గా నియామకంలో తమకు ఇచ్చిన ప్రాధాన్యతతోపాటు అందించిన సహకారానికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు చెకోలేకర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ ఉన్నారు.

## కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి అన్ని వార్డుల్లోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు తెలిపారు. గురువారం 4వ వార్డులోని సాయినగర్‌కాలనీ ఫేజ్-2, 3లో సుమారు రూ.29లక్షలతో సీసీ, డ్రైనేజీ, రూ.5లక్షలతో విఘ్నేశ్వర, వీపీఆర్ కాలనీ ఆర్చీ నిర్మాణ పనులను ఆమె స్థానిక వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ దశలవారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులను కేటాయిస్తూ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నామని తెలిపారు. అధికారుల, ప్రజల సహకారంతో పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈలు శివానందం, సుమంత్, మహేష్, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చందూలాల్, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాంరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

## కమ్యూనిటీహాల్ పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని కృష్ణనగర్ మిత్ర పార్క్‌లో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీహాల్ పనులను గురువారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ప్రారంభించారు. వీటితోపాటు బోర్‌వెల్ నిర్మాణం, పార్క్ మరమ్మతులు చేయించనున్నట్లు ఆమె వివరించారు. డివిజన్‌లోని బస్తీలు, కాలనీలు, మురికివాడల్లోని ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ వివరించారు. కార్యక్రమంలో కృష్ణనగర్ మిత్ర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆవుల ప్రవీణ్‌యాదవ్, కాలనీవాసులు అశోక్, నర్సింగ్, సాయిరాం, సందీప్, జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ జగన్నాథ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలి

● రాచకొండ క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న రాచకొండ క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు, తదితరులు

వనస్థలిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న రంగంలో అభివృద్ధిని సాధించాలని రాచకొండ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు అన్నారు. వనస్థలిపురం హిల్ కాలనీలోని నారాయణ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం నిర్వహించిన బహుమతుల ప్రదానం కార్యక్రమానికి రాచకొండ క్రైమ్ డీసీపీ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని రాణించాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడా పోటీల్లో నారాయణ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చడం అభినందనీయమన్నారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నారాయణ పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబర్, ఆర్.ఎం రవిప్రసాద్, ప్రిన్సిపాల్ భవాని పాల్గొన్నారు.

## వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి కృషి

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



మధుయాష్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గెలుపు ఓటములతో సంబంధం లేకుండా వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి, సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశానికి మధుయాష్కీగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని మధుయాష్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ గెలుపు ఓటములకు సంబంధం లేకుండా కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల నివారణకు చర్యలు

● చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు



కాలనీ, ఆలయ ప్రతినిధులతో మాట్లాడుతున్న చైతన్యపురి పోలీసులు

కొత్తపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యానగర్‌లోని హరిహరక్షేత్రం, వాకింగ్ ట్రాక్ సహా పరిసరాల్లోనూ అసాంఘిక కార్యకలాపాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం రాత్రి ఆయన, ఎస్‌ఐ భద్రయ్య తదితరులు సత్యానగర్‌కాలనీలోని నల్లపోచమ్మ ఆలయం, హరిహరక్షేత్రం, వాకింగ్ ట్రాక్ సహా పరిసరాల్లో పర్యటించారు. ఆలయాల పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని, రాత్రివేళ వాకింగ్ ట్రాక్ ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నివారించడానికి ఆలయ కమిటీ చైర్మన్ రవికుమార్‌యాదవ్ తదితరులు పోలీసు అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బాలన్న, శివరాజ్ పాటిల్, పటేల్, పెంటయ్య, షిండేజీ పాల్గొన్నారు.

# అంటరానితనంపై పోరాడిన సుదర్శన్‌రావు

● మంత్రి జూపల్లి కృష్ణారావు



స్వాతంత్ర సమరయోధులు సుదర్శన్‌రావు స్మృతి సంచికను మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేస్తున్న రామచంద్రరావు

ఎల్‌బీనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు పెంటమరాజు సుదర్శన్‌రావు అంటరానితనంపై పోరాడి దళితులకు ఆలయ ప్రవేశం కల్పించారని మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. స్వాతంత్ర సమరయోధులు పెంటమరాజు సుదర్శన్‌రావు స్మృతి సంచికను ఎస్‌ఆర్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావు మంత్రి జూపల్లి కృష్ణారావుకు గురువారం నగరంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంప్రదాయ కుటుంబంలో పుట్టినప్పటికీ సుదర్శన్‌రావు సామాజిక స్పృహతో వ్యవహరించేవారన్నారు. తాను జిల్లా మంత్రిగా ఉన్నందున సుదర్శన్‌రావును చాలా సార్లు సత్కరించే అవకాశం కలిగిందన్నారు. సుదర్శన్‌రావును ప్రభుత్వం ఉత్తమ సంఘసంస్కర్తగా గుర్తించి రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సత్కరించడం జరిగిందన్నారు. జిల్లాలోని స్వాతంత్ర సమరయోధుల చరిత్రలో వారిది ప్రత్యేక స్థానమని కొనియాడారు. కార్యక్రమంలో వెన్నెల సాహిత్య అకాడమి అధ్యక్షుడు ముచర్ల దినకర్, కాంగ్రెస్ కోడేరు మండల అధ్యక్షుడు వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించిన డీసీపీ



ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. వనస్థలిపురం ఆటోనగర్‌లోని హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారి ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో టాటా గ్రూప్ సంస్థ అయిన టైటాన్ ఐ ప్లస్, హెచ్‌జీటీఏ సహకారంతో ఔటర్ టోల్ వసూళ్ల ఏజెన్సీ ఐఆర్‌బీ సంస్థ గురువారం నిర్వహించింది. వాహనదారులకు కంటి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలను అందించారు. శనివారం వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని, కళ్లు సరిగా కనిపించనప్పుడు కళ్లజోడు పెట్టుకోవడానికి మొహమాటపడకూడదని తెలిపారు. కళ్లద్దాలతో సరిపోక అంతకంటే ఎక్కువగా ఎవరికైనా శుక్లాలు ఏర్పడితే వాటికి ఆపరేషన్లు చేయించడానికి కూడా ఇక్కడి నుంచి రిఫర్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని డ్రైవర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, హెచ్‌జీటీఏ అధ్యక్షుడు అజయ్‌శర్మ, హెచ్‌జీటీఏ ఉపాధ్యక్షుడు వినీల్, ఎన్‌ఓఆర్‌ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్నల్ గిరీశ్వర్, హెచ్‌జీసీఎల్ డీజీఎంలు చంద్రశేఖర్, రిజ్వాన్, ఏజీఎం మీనాక్షి, ఐఆర్‌బీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల దినోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల దినోత్సవాన్ని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మత్స్యశాఖ ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండాను ఎగురవేశారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. మత్స్యకారులకు రాజకీయంగా అన్ని పార్టీలు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం నాయకులు సాదు యాదగిరి, జోర్క రాముముదిరాజ్, లక్ష్మణ్, శ్రీరాములుముదిరాజ్, జగన్, రామచందర్, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనుల పరిశీలన

కొత్తపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్‌లో మురుగు సమస్య పరిష్కారానికి రూ.12లక్షలతో నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన జలమండలి ఏఈ స్రవంతిరెడ్డి తదితర అధికారులతో కలిసి మోహన్‌నగర్ - సౌభాగ్యపురం దారిలో గల వాటర్ ట్యాంకుల సమీపంలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు ఆరిఫ్, దయాకర్, నాయకులు సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

మన్సూరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తమ వంతుగా ఉప్పల ఫౌండేషన్ ద్వారా చేయూతనందిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్‌కు చెందిన బసెట్టి రాజు, రేణుక పేదింటి దంపతుల కుమార్తె శిరీష వివాహం నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌గుప్తా నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఐవీఎఫ్ ప్రథమ మహిళా అధ్యక్షురాలు ఉప్పల స్వప్నతో కలిసి శిరీషకు పుస్తెమట్టెలు, చీర, గాజులు అందజేశారు. కార్యక్రమంలో భవాని తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ శత జయంత్యుత్సవాలు నిర్వహించాలి



సీపీఐ శత జయంతి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. గురువారం హయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శతజయంతి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో పార్టీ శత జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుతామన్నారు. అందుకోసం 26వ తేదీన పార్టీ నాయకులతో కొత్తపేట్‌లోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో జనరల్ బాడి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ సామిడి శేఖర్‌రెడ్డి, సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, హయత్‌నగర్ మండల సమితి కార్యదర్శి శేషరాజు, పల్లి శ్రీదేవి, శోభన్, రాములుగౌడ్, సుధాకర్, గోల్కొండ నాగరాజు, సౌజన్య, జయంత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే వైఎస్‌ఆర్ విగ్రహం కూల్చివేత



కూల్చివేసిన వైఎస్‌ఆర్ దిమ్మె వద్ద నినాదాలు చేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మన్సూరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రోత్సాహంతోనే అభివృద్ధి పేరిట అధికారులు వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చివేశారని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ఎల్బీనగర్ కామినేనిచౌరస్తా వద్ద గల వైఎస్సార్ విగ్రహ దిమ్మెను అభివృద్ధి పేరిట అధికారులు గురువారం కూల్చివేతలు చేపడుతుండగా విషయం తెలుసుకున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి వెంటనే అక్కడకు చేరుకుని అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఇది ఎమ్మెల్యే పనే అంటూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహాన్ని ఎప్పటి నుంచో కూల్చాలని స్థానిక ఎమ్మెల్యే కుట్రలకు పూనుకున్నాడని, కూల్చివేసిన వైఎస్సార్ దిమ్మెను వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, నాయకులు జోగు రాములు, జైపాల్‌రెడ్డి, యాదగిరి, అక్రమ్, శ్యామల్‌రెడ్డి, పృథ్వీరాజ్, ఇరిగి రమేష్, సుక్క వెంకట్, స్వామి, నగేష్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైపులైన్‌ను దిలావర్‌ఖాన్‌చెరువు వరకు పొడిగించండి

హయత్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కమ్మగూడ నుంచి మస్కతి డెయిరీ మీదుగా సుదరయ్యనగర్‌కాలనీ వరకు వేస్తున్న భూగర్భ డ్రైనేజీ పైపులైనును ఇంజాపూర్ దిలావర్‌ఖాన్‌చెరువు వరకు పొడిగించాలని కోరుతూ గురువారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ కమ్మగూడలోని సాయిప్రియనగర్ కాలనీ, మస్కతి, హైకోర్టుకాలనీ, ప్రగతినగర్, నవభారత్ కాలనీ, ఆర్టీసీకాలనీతో పలు కాలనీల మురుగునీరును తీసుకువచ్చి సుందరయ్య కాలనీ వద్ద వదిలి పెడుతున్నారని తెలిపారు. దీంతో లక్ష్మినగర్, సుందరయ్యనగర్, ఇందిరమ్మకాలనీలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. మురుగునీరు వల్ల దుర్గంధవాసన వస్తుందని తెలిపారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల స్థానిక ప్రజలు డెంగీ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. డ్రైనేజీ పైపలైనును ఆపిల్ ఎవెన్యూ కాలనీ మీదుగా ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు వరకు పొడించాలని కమిషనర్‌ను కోరారు. కాలనీ వాసులు సత్యనారాయణ, పొటెలు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కామినేనిలో దారుణం!

● నవ్వుతూ చికిత్సకు వెళ్లిన మహిళ మృతి

● ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



ఆస్పత్రిలో రత్లావత్ కొటే మృతదేహం

మన్సూరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. గుండె జబ్బుతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిన మహిళ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిందంటూ బంధువులు ఆస్పత్రి ఆవరణలో ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా కందుకూరు మురళీనగర్‌కు చెందిన రత్లావత్ కొటే(54) అనే మహిళకు రెండు నెలల నుంచి గుండె దగ్గర నొప్పి వస్తుందంటూ నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లగా అక్కడి వైద్యులు ఆపరేషన్ చేయాలంటూ చెప్పారు. అనంతరం వారు తమకు సమీపంలో ఉండటంతో పాటు చికిత్స కూడా బాగుంటుందన్న నమ్మకంతో కామినేని ఆస్పత్రికి బుధవారం ఉదయం 7గంటల సమయంలో వచ్చి అడ్మిట్ అయ్యి చికిత్స పొందుతూ రాత్రి 10గంటలకు మృతిచెందింది. ఇందుకు ఆగ్రహించిన మృతురాలి భర్త చందు, కుమారులు శ్రీకాంత్, శ్రీను, ఇతర బంధువులు ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చికిత్స సజావుగానే జరుగుతుందని చెప్పుకొచ్చిన వైద్యులు వెంటనే చికిత్స అందించాల్సి ఉండగా రోగికి సంబంధించిన రూ.10లక్షల బీమా క్లయిమ్ అయ్యే వరకు వేచి ఉండి తీరా అవి దావా అయ్యాక చనిపోయిందని చెప్పారన్నారు. చికిత్స సజావుగా జరిగి ఆరోగ్యంగా తిరిగి వస్తానని నవ్వుతూ వెళ్లిన కొటే వైద్యుల నిర్లక్ష్యంగా కారణం గా మృతిచెందిందని ఆమె కుటుంబ సభ్యులు బంధువులతో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 9గంటలకు మృతి చెందిందని తమకు చెప్పిన వైద్యులు రిపోర్టులో 10గంటలకు అంటూ నమోదు చేయడంపై వారు మరింతగా అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువులను సముదాయించగా ఆందోళన సద్దుమణిగింది.

## యువకుడి దారుణ హత్య

సంతోష్‌నగర్ : సంతోష్‌నగర్‌లో పాత కక్షలతో యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ ఎంబీ హట్స్‌కు చెందిన మహ్మద్ మోహిత్ ఖాన్(18) పండ్ల వ్యాపారి. ఓవైసీ కాలనీలోని బర్హానాషా దర్గాలో బుధవారం రాత్రి ఉర్సు ఉత్సవాలు జరుగుతుండడంతో మోహిత్ స్నేహితులతో కలిసి ఉర్సులో పాల్గొన్నాడు. ఊరేగింపు ఓవైసీ కమాన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తులు మోహిత్‌ను అడ్డగించి కత్తితో దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన మోహిత్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఓవైసీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ కోల సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మోహిత్ తండ్రి సాబర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు సంతోష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బైకు సైలెన్సర్ మార్చి నడిపిన రైడర్‌పై చర్యలు



బైకు రైడర్ వివరాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్

కొత్తపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బైకు సైలెన్సర్ మార్చి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసిన బుల్లెట్ బైకు రైడర్‌పై ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు చర్యలు తీసుకున్నారు. ఎల్బీనగర్ మాల్ మైసమ్మ ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాలతో పాటు, కొత్తపేట చౌరస్తా, అల్కాపురి చౌరస్తా పరిసర ప్రాంతాల్లో కొందరు యువకులు మధ్యాహ్నం, రాత్రి విపరీతమైన శబ్దం వచ్చేలా సైలెన్సర్ మార్చేసిన బైకును అతి వేగంగా నడుపుతూ ఇతర వాహనదారులను, ప్రయాణికులనూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కొత్తపేట చౌరస్తాలో ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో సరూర్‌నగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి సాయికిరణ్ విపరీతంగా శబ్దం వచ్చేలా బుల్లెట్ బైకు సైలెన్సర్ మార్చేసిన బైకును వేగంగా నడుపుతూ ప్రయాణికులను, ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు శబ్ద కాలుష్యం చేశాడు. అతడిని పట్టుకుని బైకును స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అతడితో మాట్లాడి హెల్మెట్ లేకపోవడం, నెం.ప్లేట్ సరిగ్గా లేకపోవడం తదితర నిబంధనల ఉల్లంఘనల కారణంగా నోటీసు అందజేశారు. కోర్టుకు హాజరైన తర్వాత జరిమానా రూ.1100లతో పాటు, ఆ బైకుపై ఉన్న రూ.1200 పెండింగ్ చలానా చెల్లించాలని, ట్రాఫిక్ పీఎస్‌లో పేరెంట్‌తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని నోటీసు ఇచ్చారు. ప్రజలను ఇతర వాహనదారులనూ విపరీతమైన శబ్దం వచ్చేలా సైలెన్సర్లను మార్చిన బైకులను నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

## బీసీల హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

● రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

● బీసీ కులాలు, సంఘాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం బీసీ కమిషన్ చైర్మన్, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులపై బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంచార జాతులు, ముదిరాజు, పూసల, మేదర, గంతపుత్ర, బెస్త, బీసీ హక్కుల సాధన కమిటీ, విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ, వాల్మీకిబోయ, వడ్డెర, వీరభద్రుల, రజక, కుమ్మర, దూదేకుల, కుర్మ, మేదర సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని, ఇప్పటివరకు ఏడు విచారణలు పూర్తి చేయగా, ఇది ఎనమిదో విచారణ అని తెలిపారు. ఈనెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పనిచేస్తుందని, బీసీ కమిషన్ ఈ విషయంలో ముక్కుసూటిగా వ్యవహరిస్తుందని, బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్య తీసుకునేందుకైనా బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కును లబ్ధిదారుడికి అందజేస్తున్న జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

## సీఎం సహాయనిధి పేదలకు వరం : రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌కు చెందిన జావిడి మదన్ కొంత కాలంగా గుండెకు సంబంధించిన జబ్బుతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత సీఎం సహాయనిధి కోసం జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డిని సంప్రదించాడు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.60వేలు మంజూరు చేయించారు. ఆ చెక్కును గురువారం బాధితుడికి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లం శ్రీధర్‌గౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, యశ్వంత్‌కుమార్, కరణ్‌కుమార్, శ్రీకాంత్, లక్ష్మారెడ్డి, గౌస్ పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణయ్య, కార్పొరేటర్ అరుణ

## ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానం

మన్సూరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో రూ.1.60లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ, కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే నేరాలను అదుపు చేయవచ్చని, ప్రతి ఒక్కరూ తమ కార్యాలయాలు, వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్, ఎస్‌ఐ శివనాగప్రసాద్, కాలనీ అధ్యక్షుడు ధనరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు మనిదీప్, సూర్యప్రకాశ్, సాయికిరణ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

చాదర్‌ఘాట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ఉన్న సర్వీసు రోడ్డు కిరువైపులా వాహనాల అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, మోహన్‌తో కూడిన బృందం మలక్‌పేట ట్రాఫిక్ ఎస్‌ఐ రామును కలిసి వినతిపత్రం సమర్పించారు. సర్వీసు రోడ్డు కిరువైపులా అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేయిస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాన్స్‌పోర్టు వాహనాలన్నీ సర్వీసు రోడ్డు కిరువైపులా యథేచ్ఛగా పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారని, దీంతో స్థానిక వ్యాపారులు తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు వీలులేకుండా పోతుందన్నారు. వ్యాపార కేంద్రాల్లో కొనుగోలు చేసేందుకు వస్తున్న వినియోగదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు వీలులేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందించిన మలక్‌పేట ట్రాఫిక్ ఎస్‌ఐ రాము మాట్లాడుతూ అక్రమ పార్కింగ్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



సెల్‌టవర్‌ను నిర్మించవద్దని ఆందోళన నిర్వహిస్తున్న కాలనీవాసులు

## సెల్ టవర్‌ను కాలనీలో నిర్మించొద్దు

వనస్థలిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాలను ఛిద్రం చేసే సెల్ టవర్‌ను తమ కాలనీలో ఏర్పాటు చేయవద్దని ద్వారకామాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం సాయంత్రం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రవీణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల అనారోగ్యాలకు ప్రధాన కారణమైన సెల్‌టవర్‌ను తమ కాలనీలో ఏర్పాటు చేయరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం ఈ సెల్‌టవర్ నిర్మాణపు పనులను ప్రారంభిస్తున్న తరుణంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ఆందోళన కార్యక్రమం చేపడితే సదరు సెల్‌టవర్ నిర్మాణదారులు పనులను నిలిపివేశారని గుర్తుచేశారు. గురువారం తిరిగి కాలనీవాసులకు ఎలాంటి సమాచారం లేకుండా సెల్‌టవర్ ఏర్పాటు పనులను చేపట్టడం సహించరానిదన్నారు. తమ ప్రాణాలకు తీవ్ర ఇబ్బందులు సృష్టించే సెల్‌టవర్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు సురేందర్, రమణ, శేఖర్‌సాగర్, అచ్చాలుగౌడ్, విజయ్‌బాబు, బాలేశ్వర్‌రావు, మహిళలు పాల్గొన్నారు.